క్లుప్తంగా

డిగ్రీ కళాశాలలో పీజీ కంప్యూటర్ సైన్స్ కోర్సు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ కంప్యూటర్ సైన్స్ కోర్సు అందుబాటులోకి వచ్చినట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుగా అందుబాటులోకి వచ్చిందని.. ఆసక్తి ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామదేవతకు తిలక్ పూజలు


గ్రామదేవత ఉత్సవంలో తిలక్ తదితరులు

నందిగాం: కల్లాడ పంచాయతీ మదనాపురంలో నిర్వహిస్తున్న గ్రామ దేవత ఉత్సవాల్లో వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆదివారం పాల్గొన్నారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు, జల్యాడ జయరాం, పోలాకి మోహనరావు, కణితి నారాయణమూర్తి తదితరులు ఉన్నారు.

విత్తనాలు పంపిణీ


విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

కవిటి: బెజ్జిపుట్టుగ గ్రామంలో సబ్సిడీపై వరి విత్తనాలను ఎమ్మెల్యే బెందాళం అశోక్ సోమవారం ప్రారంభించారు. కవిటి మండలంలో 631 క్వింటాళ్ల వరి విత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాధికారి పి.శ్రీదేవి తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు బి.నరసింహమూర్తి, భార్గవి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు


రిలయన్స్‌స్మార్ట్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఇచ్ఛాపురం: గంజాయి వంటి మత్తుపదార్థాల అక్రమ రవాణా కాకుండా ఉండేందుకు నార్కోటిక్ డాగ్‌తో సహాయంతో స్థానిక రైల్వేస్టేషన్, రిలయన్స్ స్మార్ట్ షాపింగ్ మాల్‌లో సోమవారం పట్టణ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సీఐ మీసాల చిన్నంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర పంటలతో ఆదాయం


గోకర్ణపురంలో అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కంచిలి: కొబ్బరి తోటల్లో సేంద్రీయ పద్ధతిలో అంతర పంటలను సాగు చేయడం ద్వారా చక్కని ఆదాయం సమకూరుతుందని ప్రకృతి వ్యవసాయ విధానం రీజనల్ ఆఫీసర్ ప్రకాశ్ అన్నారు. గోకర్ణపురం యూనిట్ పరిధి గోకర్ణపురం, కుత్తుం గ్రామాల్లో సోమవారం ఫీల్డ్ విజిట్ చేసి అక్కడి పంటల గురించి వివరించారు. కుత్తుంలో కొబ్బరితోటల మధ్యలో వివిధ రకాల విత్తనాలతో అంతర పంటలను సాగు చేయవచ్చని సూచించారు. సిబ్బంది లోహిదాసు, సంజీవ్, టి.శివానందం, కుమారి, కామరాజు, సుహాసిని ఉన్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

కాశీబుగ్గ: పలాస మండలం టెక్కలిపట్నం గ్రామానికి చెందిన వివాహిత దాసరి హైమావతి (33) కనిపించడం లేదని భర్త దాసరి గంగయ్య కాశీబుగ్గ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. సీఐ సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం


ర్యాలీ చేస్తున్న స్వయంసేవకులు

కవిటి: హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సీహెచ్ కపాసుకుద్ధి గ్రామంలో సోమవారం నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ సేవలు ప్రశంసనీయమైన ఈ సందర్భంగా వక్తలు అన్నారు. హిందూ సామ్రాజ్య దినోత్సవ ప్రాధాన్యత తెలిసేలా నినాదాలు చేస్తూ గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. ముందుగా ఛత్రపతి శివాజీ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు.

కుచించుకుపోతున్న
కాలువలు!

- ఆక్రమణకు గురవుతున్న డ్రైనేజీ
- పట్టనట్టు వ్యవహరిస్తున్న మున్సిపల్ అధికారులు
- చిన్నపాటి వర్షానికే రోడ్లపైకి వస్తున్న మురుగునీరు


దానంపేటలో ఆక్రమణలకు గురైన పెద్ద కాలువ

ఇచ్ఛాపురం:

ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోంది. దీనికి ప్రధాన కారణం మురుగునీరు ప్రవహించాల్సిన కాలువలను కొంత మంది ఆక్రమించేయడమే. ఫలితంగా చిన్నవర్షం కురిసిన కాలువల్లో పారాల్సిన మురుగు రోడ్లపైకి ఎక్కుతుండడంతో ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. పెద్ద కాలువలతోపాటు చిన్నవి సైతం ఆక్రమణలకు గురౌతున్నాయి. మరికొన్ని కనిపించకుండా పోతున్నాయి. మున్సిపల్ అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడంతో ఆక్రమణదారులు భయం లేకుండా బరితెగిస్తున్నారు. వర్షాలు పడినప్పుడు వర్షపు నీరు వెళ్లేందుకు అనువైన మార్గం లేకపోవడంతో మురుగు నీరు అంతా రోడ్డుపై నుంచి ప్రవహిస్తుంది. కొన్ని సందర్భాల్లో వర్షపు నీరు మురుగునీటితో పాటు ఇళ్లల్లోకి ప్రవేశిస్తుంది. ఏటా కాలువల్లో పూడిక తీసేందుకు లక్షలాది రూపాయలను కేటాయిస్తున్నారు. అయితే చాలా మంది కాలువలను ఆక్రమణ చేసుకొని నిర్మాణాలు చేసిన కారణంగా పూడిక తీయడానికి పారిశుద్ధ్య కార్మికులకు అనుకూలంగా ఉండడం లేదు. రానున్నది వర్షాకాలం కావడంతో ముందుగానే మున్సిపల్ అధికారులు మేల్కొని ఆక్రమణలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆక్రమణలు ఇలా..

ఇచ్ఛాపురం పట్టణంలో ప్రధానమైన కాలువలను ఆక్రమించేసి వాటిపై పక్కా భవనాలు, మరుగుదొడ్లను నిర్మించేశారు. మెయిన్‌రోడ్‌లో ఈ పరిస్థితి మరీ ఎక్కువగా ఉంది. బస్టాండ్ నుంచి ఆస్పత్రి రోడ్డు నుంచి దానంపేట మీదుగా వెళ్లే ప్రధాన కాలువ చాలా వరకు ఆక్రమణకు గురైంది. రథం వీధి, దాసన్నపేట, యూనియన్ బ్యాంక్ మీదుగా డబ్బూరివీధి గుండా కంద్రవీధి వైపుగా వెళ్లే మేజర్ డ్రైన్ ఆక్రమణలకు గురై కాలువల పైనే పక్కా భవనాల నిర్మాణాలు చేపట్టారు. కొన్ని కాలువలపై తాత్కాలికంగా దుకాణాలు వెలిశాయి. ఈ కారణంగా పట్టణంలో చాలాచోట్ల కాలువలు కుదించుకుపోగా మరికొన్ని పూర్తిగా కనుమరుగైపోయాయి. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు ఆక్రమణలకు గురైన కాలువలను సర్వే చేయించి, కనిపించకుండా కప్పబడిపోయిన కాలువలను బయటికి తీసి డ్రైనేజీ వ్యవస్థను క్రమబద్ధీకరిస్తే భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉంటాయని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. లేకుంటే రానున్న వర్షాకాలంలో అవస్థలు తప్పవని భయపడుతున్నారు.


దాసన్నపేటలో కాలువపై వెలసిన దుకాణాలు


దానంపేటలో కాలువలు ఆక్రమణకు గురవ్వడంతో వర్షానికి నిలిచిపోయిన మురుగునీరు

నోటీసులు జారీ చేస్తాం



కాలువలను ఆక్రమించిన వారిని గుర్తించి నోటీసులు జారీచేస్తాం. కాలువలను ఆక్రమించి నిర్మాణాలను చేపట్టినవారు స్వచ్ఛందంగా వాటిని తొలగించి మున్సిపల్ సిబ్బందికి సహకరించాలి. లేకపోతే ఆక్రమణలను కూల్చివేస్తాం.

–ఎన్.రమేష్, మున్సిపల్ కమిషనర్, ఇచ్ఛాపురం

పెరిగిన కలాసీల కూలి


ఒప్పంద పత్రాన్ని అందుకుంటున్న సంఘం ప్రతినిధులు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీలో వివిధ వ్యాపార సంస్థల్లో పనిచేస్తున్న కలాసీల కూలి పెంచుతూ ఆయా వ్యాపార వర్గాలు నిర్ణయం తీసుకున్నాయి. కూలి రేట్లను పెంచాలని మూడు రోజులుగా చేపట్టిన సమ్మెతో సోమవారం వ్యాపారవర్గాలు, కలాసీల మధ్య సమన్వయ సమావేశంతో పాటు చర్చలు నిర్వహించారు. దీంతో ప్రస్తుతం ఉన్న రేట్లకు 20 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. పెరిగిన కూలి రేట్లు మూడు సంవత్సరాల వరకు అమలులో ఉండే విధంగా ఒప్పంద పత్రాలను ఇచ్చిపుచ్చుకున్నారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా టెక్కలిలో కలాసీలకు కూలీ రేట్లు పెంచినట్లు వర్తక సంఘం ప్రతినిధులు వెల్లడించారు. సమావేశంలో వర్తక సంఘం అధ్యక్షుడు లాడి శ్రీనివాసరావు, ఎరువుల వ్యాపారి దోని కొండలరావుతో పాటు డోకి రాజేష్, వై.గోవింద్, ఎం.గోవింద్, కలాసీ సంఘం అధ్యక్షుడు జానీ, ఎల్.వేణు, జి.నాగేశ్వరరావు, వసంత్, వై.బాలరాజు, బాబూరావు పాల్గొన్నారు.

‘సాక్షి’పై దాడులు తగవు

సాక్షి ఛానల్‌లో జరిగిన చర్చను సాకుగా చూపుతూ టీడీపీ నాయకులు సోమవారం ఆందోళనలకు దిగారు. ఈ నేపథ్యంలో సాక్షి కార్యాలయాల వద్ద ధర్నాలు చేయడంతోపాటు ఆస్తులను ధ్వంసం చేయడం, అలాగే సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును పోలీసులు అరెస్టు చేశారు. టీడీపీ శ్రేణుల దాడులను పలువురు ఖండించారు. అక్షరంపై దాడులు తగవన్నారు. –సాక్షి నెట్‌వర్క్

కొమ్మినేనిది అక్రమ అరెస్టు



సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడం తగదు. ఆయన అరెస్టు అక్రమం. సాక్షి చర్చా వేదికలో ఎవరో మాట్లాడిన మాటలకు కొమ్మినేనిని ఎలా అరెస్ట్ చేస్తారు? ముమ్మాటికీ ఇది రాజకీయ కుట్ర. ఇలాంటి సంఘటనలు ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. అలాగే సాక్షి ఎచ్చెర్ల యూనిట్ కార్యాలయంపై టీడీపీ కార్యకర్తలు దాడి చేయడం మిక్కిలి హేయమైన చర్య. ఏమైనా అభ్యంతరాలుంటే న్యాయబద్ధంగా తేల్చుకోవాలి.

–గన్ని అశోక్ కుమార్, సీనియర్ జర్నలిస్టు, కంచిలి

దాడులు సరికాదు..



సాక్షి కార్యాలయంపై దాడులు చేయడం అధికార పార్టీ నాయకుల దౌర్జన్యానికి నిదర్శనం. చర్చలో పాల్గొన్న వారికి సాక్షి యాజమాన్యానికి సంబంధం లేదు. అలాంటప్పుడు దాడులు సరికాదు. ప్రభుత్వ తప్పులను, హామీలు అమలుపై నిలదీస్తుండటంతో కక్ష్య సాధింపులో భాగంగా ఈ దాడులు జరుపుతున్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటివి సరికాదు.

– నడుపూరు శ్రీరామమూర్తి, ఎంపీపీ, నందిగాం

ప్రశ్నించే గొంతు నొక్కే కుట్ర



ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చమని ప్రశ్నించిన వారిపై అక్రమంగా పోలీస్ కేసులు బనాయించడం, ప్రశ్నించే గొంతులు నొక్కే కుట్రకు కూటమి ప్రభుత్వం తెరలేపింది. కూటమి ప్రభుత్వ అవినీతి, అక్రమాలను వెలికి తీస్తున్న మీడియా సంస్థలపై దాడులకు పాల్పడిన తీరు ఎమర్జెన్సీ రోజులను గుర్తుకు వస్తున్నాయి. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును సంబంధం లేని అంశాలు చూపి అక్రమంగా అరెస్ట్ చేయడం, సాక్షి కార్యాలయాలపై దాడులకు పూనుకోవడం దారుణం. వీటిని ప్రజలు గమనిస్తున్నారు.

– బమ్మిడి దుర్యోధనరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి

అనుమతి లేని విద్యా సంస్థలను సీజ్ చేయాలి


పలాసలోని జేవై విద్యాసంస్థ వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కాశీబుగ్గ: అనుమతి లేకుండా నడుస్తున్న విద్యా సంస్థలను గుర్తించి తక్షణమే సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. విద్యాశాఖాధికారుల సహకారంతో జిల్లాలో పలుచోట్ల పాఠశాలలు నడుస్తున్నాయని ఆరోపించారు. అనుమతి లేకుండా నడుస్తోందని ఆరోపిస్తూ పలాసలోని జేవై విద్యాసంస్థ వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సాయికుమార్ మాట్లాడుతూ.. శ్రీచైతన్య, నారాయణ విద్యా సంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజులు, పుస్తకాల రూపేణా లక్షలాది రూపాయలు దండుకుంటున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని ఆరోపించారు. ఏఐఎస్ఎఫ్ పలాస నియోజకవర్గ అధ్యక్షులు సూర్య, విజయ్, చిరు, సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో ప్రయోజనం

కవిటి: నవధాన్యాల సాగుతో ఎంతో ప్రయోజనం ఉందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అన్నారు. గొర్లెపాడు యూనిట్ శిలగాంలో నవధాన్యాలు సాగు వరుస క్రమంలో పెంపకంపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా రైతు అప్పలస్వామి రెండ ఎకరాల జీడి మామిడి తోటలో నవధాన్యాలు విత్తనాలను పచ్చిరొట్ట ఎరువు కోసం చల్లారు. ప్రకృతి వ్యవసాయవిధానం సిబ్బంది ప్రకాష్, హేమసుందర్ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

టెక్కలి: లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి హెచ్చరించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో వైద్య, ఆరోగ్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు, మెడికల్ ల్యాబ్‌లలో ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కోఆర్డినేటర్ ఎస్.విజయలక్ష్మి, ఎన్‌జీఓ ప్రతినిధి డి.రమాదేవి, వైద్యుడు ఎస్.రాజశేఖర్, ధనలక్ష్మి, వివేకానంద పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికిపోవద్దు


పోలీసులతో కలిసి ప్రచారం చేస్తున్న కళాకారులు

కంచిలి: ప్రస్తుత సమాజంలో యువతను చిదిమేస్తున్న మాదక ద్రవ్యాలు, డ్రగ్స్, గంజాయి జోలికి పోవద్దంటూ ఢీ, జబర్దస్త్ ఆర్టిస్టులు ప్రచారం చేశారు. ఆదివారం రాత్రి కంచమ్మతల్లి ఉత్సవాల్లో భాగంగా స్టేజి షో ఇవ్వడానికి వచ్చిన ఆర్టిస్టులు కొంత సమయం ఈ మేరకు స్థానిక పోలీసుల సూచనల మేరకు అవగాహన కల్పించారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు ఉపయోగించినట్‌లెతై టోల్ ఫ్రీ నంబర్ 1072కు తెలియపరచాలని ఈగల్ టీం సభ్యులు కోరారు. సోంపేట సీఐ బి.మంగరాజు, ఇచ్ఛాపురం సీఐ చిన్నంనాయుడు, కంచిలి ఎస్సై పి.పారినాయుడు, ఈగల్ టీం సభ్యుడు సంతోష్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా పెంటపోలమ్మ ఉత్సవం


దేవతామూర్తుల వేషధారణలో గృహిణులు

కాశీబుగ్గ: కాశీబుగ్గలో పెంటపోలమ్మ తల్లి గ్రామదేవత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈనెల ఆరో తేదీన ప్రారంభమైన ఉత్సవాలు సందడిగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా కాశీబుగ్గలోని వీధుల్లో మహిళలు దేవతామూర్తుల వేషధారణలతో ఆకట్టుకుంటున్నారు. సోమవారం జరిగిన పూజల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


బమ్మిడి సంతోష్‌కుమార్

కాశీబుగ్గ: అనంతపురం జిల్లా కూడేరు మండలం పరిధి ఎన్సీఆర్‌నగర్‌లో ఇంటర్ విద్యార్థిని తన్మయిని దారుణంగా హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం పలాస నియోజకవర్గం అధ్యక్షులు బమ్మిడి సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థిని దారుణంగా హత్య చేయడం ఆందోళన కలిగిస్తుందన్నారు. హోంమంత్రి దళిత మహిళై ఉండికూడా కూటమి పాలనలో రాష్ట్రంలోని దళిత, గిరిజన మహిళలకు ఏమాత్రం రక్షణ లేకుండా పోవడం బాధాకరమన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


టెక్కలి: ర్యాలీలో అధికారులు, నాయకులు

మందస: నిత్యం యోగా చేయడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధ్యమని వక్తలు అన్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం అధికారులు, నాయకులు అవగాహన ర్యాలీలు, మానవహారాలు చేపట్టారు. మందస మండల కేంద్రంలో జరిగిన అవగాహన ర్యాలీలో వెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు మాట్లాడుతూ..యోగా గురించి ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్లు తారక్ మోహన్, ముఖలింగం, మంగమ్మ, కళ్యాణి, కృష్ణకుమారి, శోభారాణి, శారద, నాగమణి పాల్గొన్నారు.

టెక్కలి: యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని టెక్కలిలో అధికారులు, నాయకులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు ర్యాలీని కొనసాగించి యోగా వలన కలిగే ప్రయోజనాలను వివరించారు.

ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురం పట్టణంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ ఆధ్వర్యంలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. బస్టాండ్ ఆవరణలో మానవహారం చేసి యోగాతో ప్రయోజనంపై నినాదాల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాగరాజుపాత్రో, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్రకుమార్. మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

కంచిలి: కంచిలిలో ఎంపీడీవో వి.తిరుమలరావు ఆధ్వర్యంలో యోగాంధ్ర అవగాహన ర్యాలీని నిర్వహించారు. తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, పలువురు ఉద్యోగులు, ఆశ్రమ నిర్వాహకుడు రమేష్‌కుమార్, మోహనరావు పాల్గొన్నారు.


మందస: ర్యాలీ చేస్తున్న అధికారులు


ఇచ్ఛాపురం టౌన్: యోగాంధ్ర ర్యాలీలో ఉద్యోగులు

కవిటి: కవిటి మండల కేంద్రంలో ఉత్సాహంగా యోగా అవగాహన ర్యాలీ జరిగింది. తహసీల్దార్ బి.మురళీమోహనరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి, మహిళా స్వయంశక్తి సంఘాల సభ్యులు, ఉపాధిహామీ పథకం వేతనదారులు, ఏపీఎం కె.గోవిందరావు, ఈవో జి.వీరభద్రస్వామి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బి.రమేష్, మాజీ సర్పంచ్ ఎ.మధు పాల్గొన్నారు.

పలాస: మండలంలోని రెంటికోటలో యోగాంధ్ర ర్యాలీని నిర్వహించారు. స్థానిక గ్రామ సచివాలయం నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ సాగింది. ఆర్డీవో వెంకటేష్, ఇన్‌చార్జి తహసీల్దార్ గిరి, ఎంపీడీవో కె.వసంతకుమార్, పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, రెంటికోట పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్‌కుమార్, ఏపీఎం జాంబవతి, ఏపీవో శంకరరావు పాల్గొన్నారు.


కంచిలి: యోగా ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు


కవిటి: యోగా అవగాహన ర్యాలీలో అధికారులు


పలాస: యోగా ర్యాలీలో ఆర్డీవో వెంకటేష్, అధికారులు



రిటైర్డు ఉద్యోగులకు సన్మానం

టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి మండలాల్లో పని చేసి ఉద్యోగ విరమణ చేసిన పలువురుని స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు రిటైర్డు ఉద్యోగులు సంఘం కోసం విరాళాలు ఇచ్చారు. డి.వైకుంఠరావు రూ. 10,116, బి.సూర్యకళ పదివేల రూపాయలను సంఘానికి విరాళం అందజేశారు.

–టెక్కలి



వైభవంగా భేతాళ ఉత్సవం

ఇచ్ఛాపురం మండలం ఈదుపురం ఆశీవీధిలో భేతాళ అమ్మవారి ఉత్సవాన్ని గ్రామస్తులు సోమవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా గ్రామ దేవతను దర్శించుకొని మేళతాళాలు, బాణసంచా, డప్పుల దరువులతో కాళీమాత వేషధారణలతో ఊరేగించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ నర్తు ప్రసాద్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నర్తు నరేంద్రయాదవ్, పెద్దరెడ్డి నీలాద్రిరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

–ఇచ్ఛాపురం రూరల్



హెచ్‌ఎంకు ఘన స్వాగతం

మందస మండలం లింబుగాం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా మార్పు జగన్మోహనరావు నియమితులయ్యారు. ఈయన సోమవారం బాధ్యతలు చేపట్టేందుకు పాఠశాలకు రాగా.. గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. 2015 నుంచి 2019 వరకు జగన్మోహనరావు ఇదే పాఠశాలలో పనిచేశారు. ఆ సమయంలో ఎక్కువ మంది పిల్లలు పాఠశాలలో చేరేందుకు కృషి చేసారని స్థానికులు గుర్తు చేశారు.

–మందస